బీమాలోకి 100% ఎఫ్‌డీఐ!

అనుమతించే యోచనలో కేంద్రం • కీలక సంస్కరణలకు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశీయ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలుపులు బార్లా తెరువబోతున్నదా? అంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయిప్పుడు. బీమా రంగంలో కీలక సంస్కరణలకు సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం.. అందులో భాగంగానే 100 శాతం ఎఫ్‌డీఐకి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వబోతున్నట్టు తెలుస్తున్నది. ఓ ప్రముఖ జాతీయ దినపత్రిక తాజాగా తెచ్చిన నివేదికలోని వివరాల ప్రకారం ఈ నెలాఖర్లో పార్లమెంట్‌కు వచ్చే వీలున్న ప్రతిపాదిత బీమా చట్ట సవరణ బిల్లులో పూర్తిగా విదేశీ బీమా కంపెనీలకు అనుమతివ్వబోతున్నారని సమాచారం. అయితే భారత్‌కు చెందిన బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి కంపెనీల భాగస్వామ్యంతో దేశీయ బీమా రంగంలో సేవలందిస్తున్న అలియాంజ్ తరహా విదేశీ సంస్థలు ఈ జాయింట్ వెంచర్లకు గుడ్‌బై చెప్పి సొంతంగా బీమా కంపెనీలను ఏర్పాటు చేయాలని చూస్తున్న తరుణంలో ఈ మార్పులకు మోదీ సర్కారు ప్రయత్నిస్తుండటం గమనార్హం.

ప్రస్తుతం 74 శాతమే

దేశంలో ఉన్న బీమా కంపెనీల్లో ప్రస్తుతం ఎఫ్‌డీఐకున్న పరిమితి 74 శాతమే. అంటే.. ఇన్సూరెన్స్ కంపెనీ యాజమాన్యంలో విదేశీయుల వాటా ఏ రకంగానూ 74 శాతాన్ని మించరాదు. 26 శాతం తప్పకుండా భారతీయుల వాటా ఉండాల్సిందే. అయితే కొత్త బిల్లులో ఈ పరిమితిని పూర్తిగా ఎత్తివేయనున్నట్టు తెలుస్తున్నది. దీంతో విదేశీ కంపెనీలు భారత్‌లో ఇక్కడి కంపెనీల భాగస్వామ్యం లేకుండానే సొంతంగా బీమా సంస్థలను పెట్టుకోవచ్చన్నమాట. ఇన్సూరెన్స్ మార్కెట్‌లో ఇక స్వతంత్రంగా వ్యాపార కార్యకలాపాలు చేసుకోవచ్చు. తమ ఈ నిర్ణయం వల్ల భారతీయ బీమా రంగం బలోపేతమవుతుందని, విదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తాయని, మార్కెట్‌లో పోటీ కూడా పెరిగి చౌక ధరలకే బీమా అందరికీ అందుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే స్థానిక సంస్థలకున్న అవకాశాలను ఇది దెబ్బతీస్తుందన్న ఆందోళనలు అటు మార్కెట్ వర్గాల నుంచి, ఇటు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఎల్ఐసీ కోసం

బీమా చట్టం సవరణతో కేంద్ర ప్రభుత్వం తేవాలని చూస్తున్న మార్పులు.. ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) విస్తరణకూ అవకాశాలు కల్పించేలా ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. కొత్త చట్టం అమలుతో ఆరోగ్య బీమా కంపెనీ దిశగా ఎల్ఐసీ అడుగులు పడుతాయని అంటున్నారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఇది సాధ్యం పడడం లేదు. ఇదిలా ఉంటే బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్డీఏఐ కూడా లైసెన్సులకు సంబంధించి కొన్ని మార్పులను చేయాల్సి వస్తుందని అంటున్నారు.

మరిన్ని మార్పులు

ఇప్పుడున్న బీమా చట్టాన్ని సవరిస్తూ తెస్తున్న కొత్త చట్టంలో ఇన్సూరెన్స్ ఏజెంట్లపైనున్న ఆంక్షల్నీ తొలగించాలని కేంద్రం భావిస్తున్నది. ఏజెంట్లు రకరకాల సంస్థలకు చెందిన పాలసీలను స్వేచ్ఛగా అమ్ముకునే సదుపాయాన్ని తేవాలనుకుంటున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక ఏజెంట్ ఒకే సంస్థకు పని చేయాల్సి ఉన్నది. అయినప్పటికీ తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద అనేక కంపెనీలకు ఒక్కరే ఏజెంట్లుగా పనిచేస్తున్నది గమనిస్తూనే ఉన్నాం. కానీ కొత్త చట్టంతో ఇదంతా చట్టబద్ధం కానున్నది. జీవిత, జనరల్ ఇన్సూరెన్స్ రంగాల్లో ఏజెంట్లు ఎన్ని సంస్థల పాలసీలనైనా అమ్ముకోవచ్చు. దీనివల్ల దేశంలో బీమా పాలసీదారులు మరింత పెరుగుతారని కేంద్రం అభిప్రాయపడుతున్నది. కాగా, ప్రస్తుతం దేశంలో 24 జీవిత బీమా సంస్థలున్నాయి. మరో 26 జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలున్నాయి. అలాగే 6 ఆరోగ్య బీమా సంస్థలున్నాయి. వీటన్నిటికీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ) రీఇన్సూరర్‌గా వ్యవహరిస్తున్నది.

కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్

కోలిండియాతో కలిసి ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్న సింగరేణి

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలో మొదటిసారిగా కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీకి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మక ప్లాంటును మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని థర్మల్ విద్యుత్తు ప్లాంటులో ఏర్పాటు చేస్తున్నది. థర్మల్ ప్లాంట్‌లో బొగ్గును మండించడం ద్వారా వెలువడే కార్బన్‌డయాక్సైడ్‌ను హైడ్రోజన్ వాయువుతో మిళితం చేసి చివరగా మిథనాల్‌ను తయారుచేయనున్నారు. రోజుకు 500 కిలోల కార్బన్‌డయాక్సైడ్‌ను మిథనాల్‌గా మార్చే ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం తుది దశకు చేరుకున్నదని, డిసెంబర్ 31 నాటికి ఈ ప్లాంట్ పూర్తకాగలదని సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. ఈ ప్లాంట్‌లో 99.9 శాతం కర్బన ఉద్గారాలను మిథనాల్‌గా మార్చేందుకు ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ (ఈఎస్‌పీ)ని నెలకొల్పామన్నారు. కోలిండియా అనుబంధ రీసెర్చ్ యూనిట్ సీఎం పీడీఐఎల్ సహకారంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.20 కోట్ల ఖర్చు చేస్తున్నట్టు, రోజుకు 180 కేజీల మిథనాల్‌ను తయారుచేస్తామన్నారు. ఈ మిథనాల్‌ను ఎరువులు, అక్రిలిక్, ప్లాస్టిక్, సింథటిక్, ఫైబర్ వస్త్రాలు, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో వినియోగిస్తారని తెలిపారు.

మళ్లీ పెరిగిన బంగారం ధర

న్యూఢిల్లీ, నవంబర్ 18: గత కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. ప్రస్తుత పెండ్లిళ్ల సీజన్‌కావడంతో ఆభరణాల వర్తకులు, రిటైలర్లు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఊపందుకోవడంతో ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి ధర సోమవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.400 పెరిగి రూ.77,450కి చేరుకున్నది. అంతకుముందు ధర రూ.77,050గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ ధర రూ.660 ఎగబాకి రూ.76 వేల పైకి రూ.76,310కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.600 ఎగబాకి రూ.69,950 పలికింది.

92 వేలకు వెండి

బంగారంతోపాటు వెండి కూడా వెలిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,810 అధికమై రూ.92 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.90,190గా ఉన్నది. కానీ హైదరాబాద్‌లో మాత్రం రూ.99 వేల వద్ద స్థిరంగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ధర భారీగా పుంజుకోవడంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడం వల్లనే ధరలు పెరిగాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. అలాగే గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,600 డాలర్ల పైన కదలాడుతుండగా, వెండి 26 డాలర్ల స్థాయిలో ఉన్నది.

ఒకేరోజు 5 లక్షల మంది

ఆదివారం ప్రయాణించిన విమాన ప్రయాణికులు

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశవ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించేవారు రికార్డు స్థాయికి చేరుకున్నారు. ఆదివారం ఒకేరోజు ఏకంగా 5 లక్షల మంది దేశీయంగా విమానాల్లో ప్రయాణించారు. పండుగ, పెండ్లిళ్ల సీజన్‌కావడంతో ప్రయాణాలు చేసేవారు అధికంగా ఉన్నారని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ నెల 17న ఒకేరోజు దేశీయంగా నడిచిన 3,173 విమానాల్లో 5,05,412 మంది ప్రయాణించారని తెలిపింది.

హైదరాబాద్‌లోనూ పెరిగారు..

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గత నెలలో విమాన ప్రయాణికులు 22 శాతం మేర పెరిగినట్టు జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ నెలలో 24.95 లక్షల మంది ప్రయాణించారు.

రూ.50 లక్షల కోట్లు

35 రోజుల్లో ఆవిరైన మదుపరుల సంపద • స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు

ముంబై, నవంబర్ 18: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలు.. లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపదను హరించాయి. గత 35 రోజుల్లో (ట్రేడింగ్ సెషన్లలో) ఏకంగా రూ.50 లక్షల కోట్లకుపైగా మార్కెట్ విలువ పడిపోయింది మరి. ఈ ఏడాది సెప్టెంబర్ 27న బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.478.93 లక్షల కోట్లుగా ఉంటే.. ఈ నెల (నవంబర్) 18న అది రూ.428.67 లక్షల కోట్లకు క్షీణించింది. దీంతో రూ.50.26 లక్షల కోట్లు ఆవిరైనట్లైంది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 8,639.24 పాయింట్లు దిగజారింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై 85,978.25 పాయింట్ల వద్ద ఉన్నది.

తరలిపోతున్న ఎఫ్ఐఐలు

భారతీయ మార్కెట్లకు విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) దూరం జరుగుతున్నారు. స్టాక్ మార్కెట్లు ట్రేడైన గత 35 రోజుల్లో రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇక ఎఫ్ఐఐలుసహా విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐలు) గత నెల ఒక్క అక్టోబర్‌లో తరలించుకుపోయిన పెట్టుబడుల విలువే రూ.1,13,858 కోట్లుగా ఉన్నది. ఈ నెల మొదలు ఇప్పటిదాకా దాదాపు మరో రూ.23వేల కోట్లను తిరిగి లాగేసుకున్నట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) గణాంకాలు చెప్తున్నాయి. చైనా, జపాన్ మార్కెట్లు ఆకర్షణీయంగా కనిపిస్తుండటం, దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరాశాజనకంగా నమోదవుతున్న కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు వంటివి భారత్‌కు ఎఫ్‌పీఐలను దూరం చేస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పడిపోతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో డాలర్ ఇండెక్స్ పెద్ద ఎత్తున బలపడిన విషయం తెలిసిందే. ఈ పరిణామం రూపాయిపై సహజంగానే ప్రభావం చూపుతున్నది.

కోలుకోని సూచీలు

సెన్సెక్స్, నిఫ్టీలు మళ్లీ నష్టాలకే పరిమితమయ్యాయి. సోమవారం ఉదయం ఆరంభం నుంచే సెల్లింగ్ ప్రెషర్ కనిపించగా.. ఐటీ, చమురు షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 241.30 పాయింట్లు లేదా 0.31 శాతం క్షీణించి 77,339.01 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 615.25 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 78.90 పాయింట్లు లేదా 0.34 శాతం దిగజారి 23,453.80 వద్ద ముగిసింది. నిఫ్టీకి వరుసగా ఇది ఏడోరోజు నష్టం.

ప్రధాన కారణాలు

- విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ
- అమెరికా ఎన్నికల్లో ట్రంప్ విజయం
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం
- పేలవమైన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు
- విజృంభించిన ద్రవ్యోల్బణం
- లాభాల స్వీకరణ దిశగా మదుపరులు

ఐఎస్‌బీకి నూతన లోగో

హైదరాబాద్, నవంబర్ 18: ది ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నూతన లోగోను ఆవిష్కరించారు. బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో నూతన లోగోను ఆవిష్కరించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరిణామం ఐఎస్‌బీ వారసత్వానికి, ఆశయానికి అనుగుణంగా ఉంటుందని పేర్కొంది.

ఎస్బీఐ మరో 500 శాఖలు

ముంబై, నవంబర్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ కొత్తగా 500 శాఖలను ప్రారంభించబోతున్నది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అధిక వడ్డీ రేట్ల కారణంగా ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని, ఈ నేపథ్యంలో బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాలని సూచించారు.

ఆరోగ్య సంరక్షణలో ఏఐ: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): తెలంగాణను త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారుస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. 'ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేథ'పై హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేథను విస్తృతంగా వినియోగించే దిశగా ముందుకు సాగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రేడియాలజీ రోగనిర్ధారణ పరీక్షల్లో స్పెషలిస్టు వైద్యులకు ఇప్పటికే ఏఐ తోడ్పాటునందిస్తున్నదని, పరిశోధనల ద్వారా దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐజీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను ఏర్పాటు చేసి ప్రపంచ ఆరోగ్యరంగానికి దిక్సూచిగా మారిన నాగేశ్వరరెడ్డి తమ పరిశోధనలను ఇంకా ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని శ్రీధర్ బాబు కోరారు. ఏఐజీలో కృత్రిమ మేథతో పనిచేసే 'మిరా' అనే వర్చ్యువల్ వైద్య సహాయకురాలిని ప్రవేశ పెట్టి ఈ రంగంలో ఆయన ఆదర్శప్రాయులుగా మారారని శ్రీధర్ బాబు కొనియాడారు.

21న ధ్రువ పత్రాల పరిశీలన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18 : జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో 2023 సంవత్సరంలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారి ధ్రువ పత్రాల పరిశీలన 21న ఉంటుదని జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రావు ఒక ప్రటకనలో తెలిపారు. ఇందులో భాగంగా, సీఏటీ(తెలుగు) 1, సీఆర్‌టీ(హిందీ) 1, సీఆర్‌టీ(బయోసైన్స్) 1, పీఈటీ 2, పీజీ సీఆర్‌టీ(తెలుగు) 1, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ) 1, పీజీ సీఆర్‌టీ(సివిక్స్) 1, జిల్లా కేంద్రంలోని యూఆర్ఎస్ పాఠశాలలో సీఆర్‌టీ(మాథ్స్) 1 పోస్టులకు రోస్టర్ కామ్ మెరిట్ ప్రకారం 1:3 ప్రాతిపదికన ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని వివరించారు. అభ్యర్థుల జాబితా www.karimnagardeo.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వీరు 21వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లు రెండు సెట్లు జిరాక్స్ ప్రతులు అటెస్టెడ్‌తో, 3 పాస్ ఫోర్ట్స్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

గ్రామీణ కళాజ్యోతి అవార్డులకు ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18 : కరీంనగర్ ఫోకార్ట్స్ అకాడమీ ప్రతి ఏటా ప్రదానం చేసే గ్రామీణ కళా జ్యోతి అవార్డుల ఎంట్రీలకు 41వ వార్షికోత్సవం సందర్భంగా ఆహ్వానం అందిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవిత సాఫల్య పురస్కారం పద్య నాటకం వయసు 58 ఏళ్లు దాటి ఉండాలన్నారు. యువ పద్య నాటక గ్రామీణ కళా జ్యోతి, యువజన సాంఘిక సేవా పురస్కారాలకు 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న ధ్రువీకరణలు సమర్పించాలని, వయసుకు ఆధార్ సమర్పించాలని సూచించారు. జనరల్ కేటగిరీలో వాయిద్యం, కళలు, రచనలు, నాటక రచయితలు, పాటల రచయితలు, గాయకులు తమ ఎంట్రీ అని పంపాలని, దీనికి వయసుతో సంబంధం లేదని సూచించారు. ప్రత్యేక బాలల అవార్డులు గతంలో ప్రకటించినట్లు రుద్రోజు సహస్ర, లక్ష్మి, కిట్ల చరణ్ అందించనున్నట్లు వివరించారు. ఈ అవార్డులకు దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు పోస్ట్ ద్వారా ఎంట్రీలను పంపాలని చెప్పారు. దరఖాస్తులు జీ కృపాదానం, 15- 7- 47/2/2/2 రేకుర్తి, కొత్తపల్లి, కరీంనగర్‌కు పంపాలని, వివరాలకు 810 600 6238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ నెల చివరి వారంలో స్థానిక కళాభారతిలో ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

25వ తేదీలోగా ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 18 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ హానర్స్ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫీజు నవంబర్ 25వ తేదీలోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.300లతో 28వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు.

పడిపోతున్న భూగర్భ జలాలు

- 13 మండలాల్లో ప్రమాద ఘంటికలు
- సకాలంలో ప్రాజెక్టుల్లో నీరు నింపని ఫలితం
- ఆలస్యంగా మేల్కొన్నా యాసంగికి గడ్డుకాలమే!
- గతేడాది దాకా నిండుకుండల్ని తలపించిన జలాశయాలు

భూగర్భ జలాలు తగ్గిన మండలాలు

మండలం పేరు	సెప్టెంబర్-24	అక్టోబర్-24
గంగాధర	7.27 మీ	8.01 మీ
చొప్పదండి	6.55 మీ	7.68 మీ
కేశవపట్నం	3.73 మీ	6.28 మీ
రామడుగు	3.16 మీ	5.06 మీ
తిమ్మాపూర్	3.69 మీ	4.93 మీ
గన్నేరువరం	2.86 మీ	4.67 మీ
చిగురుమామిడి	2.29 మీ	3.82 మీ
సైదాపూర్	2.31 మీ	3.35 మీ
హుజూరాబాద్	2.31 మీ	2.78 మీ
జమ్మికుంట	2.33 మీ	2.65 మీ
ఇల్లందకుంట	1.90 మీ	2.65 మీ
వీణవంక	2.02	2.31 మీ
కరీంనగర్ రూరల్	1.56 మీ	1.74 మీ

కలెక్టరేట్, నవంబర్ 18 : కేసీఆర్ పాలనలో తెలంగాణ కోనసీమగా విరాజిల్లిన కరీంనగర్ జిల్లాలో మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు పునరావృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వానకాలంలోనూ భూగర్భ జలాలు అడుగంటగా, భవిష్యత్‌పై జిల్లావాసుల్లో ఆందోళన మొదలైంది. ఆయకట్టు ప్రాంతాల్లోని మండలాల్లోనే నీటి నిల్వలు తగ్గుతుండగా, రాబోయే రోజుల్లో తాగు, సాగునీటి లభ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మానేరు ఎగువ ప్రాంత మండలాలతోపాటు దిగువ మండలాల్లోనూ భూగర్భ జలాలు లోతుకు వెళ్తుండడంతో చలికాలం ముగిసే సరికే జిల్లాలో ప్రమాద ఘంటికలు తలెత్తవచ్చన్న భయం జనాల్లో మొదలైంది. ఇప్పటికే పలు మండలాల్లో నీటి నిల్వలు గత నెలతో పోల్చితే మీటరు నుంచి రెండు మీటర్ల లోతుకు వెళ్లగా, రాబోయే రోజుల్లో మరింత తీవ్రమయ్యే సూచనలున్నట్లు తెలుస్తోంది. గత సెప్టెంబర్ నెలలో జిల్లాలో సాధారణ నీటి మట్టం 3.3 మీటర్ల లోతులో ఉండగా, అక్టోబర్‌లో 4.25 మీటర్ల లోతుకు చేరినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 13 మండలాల్లో నీటి నిల్వలు తగ్గగా, ఆలస్యంగానైనా సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నిండినా భూగర్భ నీటి మట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. దశాబ్దం క్రితం ఉమ్మడి పాలనలో 25 నుంచి 30 మీటర్ల లోతుకు చేరిన భూగర్భ జలాలు, స్వరాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తై, వాటిలో నీటి నిల్వలతో క్రమేపీ గంగమ్మ పైపైకి ఉబికి వచ్చింది. ఆయకట్టుతోపాటు వ్యవసాయ బావులు, బోర్లలో కూడా నీటి మట్టం పెరిగి, భూమికి సమాంతరంగా భూగర్భ జలాలు వచ్చాయి. ఉమ్మడి పాలనలో క్రాప్ హాలీడేలు కూడా ప్రకటించగా, స్వరాష్ట్రంలో సమృద్ధిగా లభించిన నీటితో నిరంతర విద్యుత్ సరఫరా కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించింది. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తిపోతలు, నీటి నిల్వలపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో వేసవిలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తగ్గాయని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. 13 మండలాల్లో మాత్రం భూగర్భజల మట్టం పడిపోతుండడంపై ఆయా మండలాల్లోని ప్రజానీకం ప్రభుత్వ తీరుపై మండిపడుతోంది.

చొప్పదండిలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- వాహనదారుల ఇష్టారాజ్యం • ఇబ్బందుల్లో ప్రయాణికులు



తెలంగాణ చౌరస్తాలో అస్తవ్యస్తంగా వెళ్తున్న వాహనాలు

చొప్పదండి, నవంబర్ 18 : చొప్పదండి పట్టణంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిపోయింది. నియంత్రణ వ్యవస్థ లేకపోవడం, వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళ్తుండడంతో తరచూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా తెలంగాణ, అంబేద్కర్ చౌరస్తాలలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. తెలంగాణ చౌరస్తా ప్రధాన కూడలి మాత్రమే కాకుండా ప్రధాన వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది. పనుల నిమిత్తం నిత్యం ఇక్కడికి మండల ప్రజలేకాదు రామడుగు, జూలపల్లి, ధర్మారం మండలాలలోని సుమారు 30 గ్రామాల ప్రజలు వచ్చి వెళ్తుంటారు. ఈ ప్రాంతం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు రద్దీగా ఉంటుంది. అయితే వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో గత ప్రభుత్వంలో ఇక్కడ నిత్యం ఒక కానిస్టేబుల్ లేకుంటే హోంగార్డ్ ఉండి క్రమబద్ధీకరించేవారు. అయితే ఇటీవలి కాలంలో పోలీసు సిబ్బందిని ఇక్కడి నుంచి తొలగించడంతో ట్రాఫిక్ సమస్య మళ్లీ పునరావృతమవుతున్నది. ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు రోడ్డుపైనే నిలిపి ఉంచడంతో వచ్చీపోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. చౌరస్తాలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ రోడ్డుమీదే నిల్చోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా చొప్పదండి పోలీసులు స్పందించి తెలంగాణ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుల్‌ని ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సు షెల్టర్‌లేక రోడ్డు పైనే నిలుచున్న ప్రయాణికులు

భయం అవుతున్నది



తెలంగాణ చౌరస్తాలో రోడ్డుమీద వెళ్లాలంటే భయమైతున్నది. వాహనదారులు ఇష్టం వచ్చినట్లు వస్తున్నరు. తరచూ ట్రాఫిక్ జాం అవుతున్నది. చౌరస్తాలో ఒక పోలీస్‌ను డ్యూటీలో పెట్టి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలి.

- శ్రీరామోజు ప్రవీణ్, చొప్పదండి

బస్సు షెల్టర్ నిర్మించాలి



చొప్పదండి నుంచి కరీంనగర్, ధర్మారం, లక్షెట్టిపేట్, గోపాల్‌రావుపేట, జూలపల్లి, పెద్దపల్లికి రోజు చాలా మంది వెళ్తుంటారు. బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నరు. చొప్పదండి మున్సిపాలిటీ అయింది కానీ అభివృద్ధి మాత్రం జరుగతలేదు. పల్లెటూర్లల్లో బస్సు షెల్టర్లు ఉన్నాయి. మా దగ్గర కూడా నిర్మించాలి. **- గంగు కళావతి, చొప్పదండి**

బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

బస్టాండ్‌లో రద్దీ తీవ్రం..

ప్రయాణికుల ఇక్కట్లు వర్ణనాతీతం

తెలంగాణచౌక్, నవంబర్ 18: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో రద్దీ పెరుగడం, సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లపాలయ్యారు. కార్తీక సోమవారం పుణ్యక్షేత్రాలకు వెళ్లే ప్రయాణికులతోపాటు గ్రూప్-3 పరీక్షకు హాజరై వెళ్తున్న అభ్యర్థులు బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షించారు. జేబీఎస్, గోదావరిఖని, మంచిర్యాల, నిజామాబాద్, వరంగల్, వేములవాడ రూట్లల్లో నడిచే బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడ్డారు. రోజు బస్టాండ్ నుంచి 80వేల మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణం కొనసాగిస్తారు. కానీ, సోమవారం లక్ష మంది ప్రయాణించారు. కాగా, జేబీఎస్‌కు 250 బస్సులు రెగ్యులర్‌గా నడుస్తుండగా, మరో 70 అదనంగా నడిపించినట్లు ఏటీఎం సురేశ్ తెలిపారు. బస్సు ఎక్కే తొందర్లో సెల్ ఫోన్స్.బ్యాగులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

జవాబు పత్రాల బాక్సులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

రెండో రోజు 52 శాతమే

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

కలెక్టరేట్/ తిమ్మాపూర్, నవంబర్ 18 : రెండు రోజులుగా కొనసాగిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. రెండోరోజు అభ్యర్థులు 52.63 హాజరు శాతంతో 13,902 మంది మాత్రమే హాజరయ్యారు. కేంద్రాల వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లు, గుర్తింపుకార్డులు తనిఖీ చేసి కేంద్రాల లోనికి అనుమతించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ పరీక్షల ఏర్పాట్లు పర్యవేక్షించారు. పరీక్ష ముగియగానే మొదటిరోజు, రెండో రోజు జవాబుపత్రాలను భారీ భద్రత నడుమ హైదరాబాద్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కే మహేశ్వర్, ఏసీపీ విజయ్‌కుమార్, గ్రూప్ 3 పరీక్షల కోఆర్డినేటర్లు వరలక్ష్మి, సతీశ్‌కుమార్, సీఐలు కోటేశ్వర్, విజయ్‌కుమార్, జాన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరెంటెండెంట్ కాళీచరణ్‌గౌడ్ పాల్గొన్నారు. పరీక్ష రాసి అందరూ ఒకేసారి బయటకు వెళ్లిన అభ్యర్థులతో తిమ్మాపూర్ మండలంలోని రాజీవ్ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

గన్నీ సంచులు కాల్చి రైతుల నిరసన

సైదాపూర్, నవంబర్ 18 : మండలంలోని వెన్నంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో వెన్నంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నాలుగైదు రోజుల నుంచి తమ ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు సోమవారం సహకార సంఘం ఎదుట వరిగడ్డిలో సంచులు వేసి కాలబెట్టి నిరసన తెలిపారు. ధాన్యం కాంటా వేసేందుకు అవసరమైన బార్‌దాన్ ఇవ్వకపోవడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని సంఘం సిబ్బందిని గతంలో నిలదీసినా మార్పురాకపోవడంతో సంఘం కార్యాలయానికి చేరుకున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని సంఘం ఎదుట వరిగడ్డిలో సంచులను వేసి కాలబెట్టారు.